గురుకులం.. సీటు వదలం!



నేలకొండపల్లి గురుకుల పాఠశాల

25 గురుకులాలు..
2 వేల సీట్లు..

ఖమ్మం జిల్లాలో 25 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మొత్తం 2 వేల సీట్లను భర్తీ చేయనున్నారు. ఈనేపథ్యాన నాలుగో తరగతి చదివే విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరీక్ష నిర్వహిస్తారు. అందుకు ఈ నెల 20 వరకు దరఖాస్తులు స్వీకరించి ఫిబ్రవరి 11వ తేదీన పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పరీక్ష ఉంటుంది. ప్రతీ పాఠశాలలోని ఐదో తరగతిలో 80 సీట్ల చొప్పున 25 పాఠశాలలో 2వేల సీట్లను భర్తీ చేయనున్నారు. అందులో ఎస్సీ-60, బీసీ-10, ఎస్టీ-5, ఓసీ-1, బీసీ-2, మైనార్టీ-2 సీట్లను కేటాయించారు.

5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- దరఖాస్తుకు ఈ నెల 20 వరకు గడువు
- ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష
- జిల్లాలో 25 పాఠశాలలు.. 2 వేల సీట్లు
- ఎలాగైనా సీటు సాధించేలా పిల్లలకు ప్రత్యేక శిక్షణ

నేలకొండపల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. సకల వసతులు కలిగిన గురుకులంలో ఎలాగైనా తమ పిల్లలు సీటు సాధించాలని తల్లిదండ్రులు కోరుకుంటుండగా.. గురుకుల ప్రవేశాలకు తొలుత ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఇచ్చారు. కానీ విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి మేరకు అధికారులు ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించారు.

సీట్ల కోసం సన్నద్ధం..

ఖమ్మం జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో సీట్ల భర్తీ కోసం అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. అంతేకాక గ్రామాల్లో గురుకుల పాఠశాలలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈనేపథ్యాన జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు మంచి ఆదరణ ఉండడంతో సీట్ల కోసం పిల్లల తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. అందుకు ప్రత్యేక ట్యూషన్ పెట్టించడం లేదా వారే పరీక్షకు సన్నద్ధమయ్యేలా చేయడం వంటివి చేస్తున్నారు.

20లోగా దరఖాస్తు చేసుకోవాలి..



గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. గురుకులాల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందున ఈ నెల 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి.

– ఈ.ప్రమీల, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, నేలకొండపల్లి

ప్రతీ గూడెంలో ప్రచారం చేయాలి..



ప్రభుత్వం గురుకుల సంస్థ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నందున ఇందులో చేరేందుకు ప్రవేశాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి. చాలా గ్రామాల్లో ఇంకా తెలియాల్సి ఉన్నందున ప్రతీ గూడెంలో ముమ్మర ప్రచారం చేసి దళిత విద్యార్థులకు అవకాశం కల్పించాలి. అందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

– తోళ్ల సురేశ్, దళిత సంఘం నేత, నేలకొండపల్లి

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి..



ప్రభుత్వం గురుకులాల్లో ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. విద్యతో పాటు వివిధ పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి. గురుకులాలపై ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసి పర్యవేక్షణను నిరంతరం కొనసాగేలా చూడాలి. సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు. లేకపోతే ప్రత్యక్ష ఆందోళనలు చేస్తాం.

– మస్తాన్, విద్యార్థి సంఘం నేత, నేలకొండపల్లి

క్లుప్తంగా

కోటపాడులో దుప్పట్లు అందజేత


దుప్పట్లు అందిస్తున్న నాగేశ్వరరావు, సర్పంచ్

రఘునాథపాలెం: మండలంలోని కోటపాడులో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొంటిముక్కుల నాగేశ్వరరావు తనయుడు రవీందర్ బాబు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పేద మహిళలకు దుప్పట్లు అందజేశారు. పేదలకు తమ వంతుగా ఈ సాయం చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాతుల రమణసుధాకర్, బండి రమవెంకన్న, కొంగర నరేశ్, ఆరిఫ్, కొంటిముక్కుల కృష్ణయ్య, బరిగల ఉపేందర్, తగరం ఉప్పలి, తెల్లురి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంబర్ ధర విషయంలో వివాదం

నేలకొండపల్లి: అంబర్ ప్యాకెట్ ధర విషయమై వ్యాపారితో సోమవారం మధ్యాహ్న సమయాన కొందరు వివాదానికి దిగారు. మండల కేంద్రంలోని ఓ దుకాణంలో అజయ్‌తండాకు చెందిన ఎనిమిది మంది వచ్చి అంబర్ ప్యాకెట్‌ను రూ.15కు బదులు రూ.12కే ఇవ్వాలని, లేనిపక్షంలో సంగతి లేస్తామని, అవసరమైతే కిడ్నాప్ చేస్తామని హెచ్చరించారు. దీంతో భయపడిన సదరు వ్యాపారి పోలీస్‌స్టేషన్‌కు పరుగున వెళ్లి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చారు. పోలీసులను గమనించిన అజయ్‌తండా యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ప్రజా సేవకు సిద్ధం

కామేపల్లి: అధికార మదంతో బీఆర్ఎస్ నేతలు విర్రవీగారని సీనియర్ అడ్వకేట్ బోడేపూడి విఠల్‌రావు అన్నారు. మంగళవారం గోవింద్రాల గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తమ కుటుంబానికి ఎంతో రాజకీయ చరిత్ర ఉందని రాజకీయాల్లో ఆస్తులను పోగొట్టుకున్నా.. స్వచ్ఛమైన రాజకీయాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయామన్నారు. రానున్న రోజుల్లో తమ కుటుంబానికి సముచిత స్థానం కల్పించే అవకాశం ఉందని, ఏ అవకాశం వచ్చినా ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు.

డీఆర్డీఓ సైంటిస్ట్‌గా గిరిజన యువతి


నూతన కుమారి (ఫైల్)

కూసుమంచి: మండలంలోని జుజుల్‌రావుపేట గ్రామ పంచాయతీ శివారు వాల్యాతండాకు చెందిన బానోత్ నూతన కుమారి ప్రతిష్టాత్మక డీఆర్డీఓలో సైంటిస్ట్‌గా ఉద్యోగం సాధించింది. నూతన కుమారి గేట్ పరీక్ష ద్వారా ఉత్తమ స్కోరు సాధించి ఐఐటీ మద్రాస్‌లో పీహెచ్‌డీ అడ్మిషన్ పొందగా.. గత రెండేళ్లుగా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో కంట్రోల్ సిస్టం ద్వారా తన పరిశోధనలు కొనసాగిస్తుంది. ఈ క్రమంలో డీఆర్డీఓ సైంటిస్ట్‌గా హైదరాబాద్‌లో ఉద్యోగం సాధించి ఆదర్శంగా నిలిచింది. ఆమె తండ్రి శ్రీనివాస్ కాకతీయ యూనివర్సిటీలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. తమ తండాకు చెందిన నూతన కుమారి ఉద్యోగం సాధించడంతో పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతమ్మ మాలధారులకు నిత్యాన్నదానం

కామేపల్లి: తాళ్లగూడెం గ్రామంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యస్వామి దేవాలయంలో తిరుపతమ్మ మాలధారులకు నిత్య అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని తిరుపతమ్మ దీక్షా మాలధారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఎన్‌టీఆర్ వర్ధంతి

ఖమ్మంఅర్బన్: మాజీ సీఎం ఎన్‌టీఆర్ 28వ వర్ధంతిని గురువారం ఖమ్మంలో ఘనంగా నిర్వహించనున్నట్లు టీడీపీ నగర అధ్యక్షుడు వద్దేం విజయ్ తెలిపారు. ఈమేరకు భారీ బైక్ ర్యాలీ, మహా అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన నాయకులతో కలిసి మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. నాయకులు నాగండ్ల మురళి, వెంకన్న, గుండెపిన్ని నాగేశ్వరావు, నర్సింహారావు, తలపునేని జయరాం, దారపునేని చెన్నయ్య, సత్యనారాయణ, పలసం వెంకటేశ్వర్లు, పెద్దినేని రామారావు, సామినేని శేషు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుంటూరు కారం
వినోద	సైంధవ్
సాయిరాం	నా సామిరంగ,గుంటూరు కారం
ఆదిత్య	గుంటూరు కారం
శ్రీనివాస	గుంటూరు కారం
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన


మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

కామేపల్లి: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా కామేపల్లి, రామకృష్ణాపురం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల కల్పించిన మౌలిక సదుపాయాలు, రైతుల సంక్షేమ పథకాలు, ఆయుష్మాన్ భారత్ పథకం, ఆరోగ్య సంరక్షణ, సాంఘిక సంక్షేమ, కిసాన్ సన్మాన్ నిధి ద్వారా అందిస్తున్న విషయాలను వాటి ఆవశ్యకతను ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీవీ బ్యాంకు క్షేత్రాధికారి కృష్ణప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పెండ్ర అనిల్‌కుమార్, పార్వతీ, ఐసీడీఎస్ ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ


ట్రై సైకిళ్లు అందుకున్న దివ్యాంగులతో ఎన్నారై ఫౌండేషన్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ముగ్గురు దివ్యాంగులకు డిస్ట్రిక్ ఎన్నారై ఫౌండేషన్ ఆధ్వర్యాన ఎన్నారై వాసవీ వారి చేతుల మీదుగా మంగళవారం ఖమ్మం రోటరీ క్లబ్‌లో వీల్ చైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నారై వాసవీ క్లబ్ ఆఫ్ అమెరికా వారు ఖమ్మం రోటరీ క్లబ్‌ను సందర్శించి క్లబ్ సేవలను పరిశీలించింది. ఈ కార్యక్రమంలో ఎన్నారై ఫౌండేషన్ సభ్యులు బయ్యన బాబూరావు, బోనాల రామకృష్ణ, బండి నాగేశ్వరరావు, పసుమర్తి రంగారావు, వేముల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బచ్చోడు మాజీ సర్పంచ్‌కు నేతల నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామసహాయం అరవిందరెడ్డి మాతృమూర్తి సునీతాదేవి ఇటీవల మృతిచెందడంతో మంగళవారం బచ్చోడులో జరిగిన దశ దిన కర్మలో పాల్గొని పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, ఎర్రగడ్డ, జోగులపాడు సర్పంచ్‌లు గడ్డికొప్పుల రాజు, లింగయ్య, మాజీ సర్పంచ్ రామసహాయం వెంకటరెడ్డి, నాయకులు ఉడుగు ఉపేందర్, సుదర్శన్ షేక్.కరీం, గోళ్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు..


బర్లగూడెంలో అక్షింతలను పంపిణీ చేస్తున్న యువకులు

కామేపల్లి: అయోధ్య రామమందిరం నుంచి తీసుకొచ్చిన అక్షింతల పంపిణీ కార్యక్రమం మండలంలోని పలు గ్రామాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బర్లగూడెం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాలోత్ ప్రేమ్‌కుమార్, బానోత్ ఈరు, రమేశ్, రాజు, సునావత్ హరిలాల్, ఇస్లావత్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీరోలులో అ'పూర్వ' సమ్మేళనం

తిరుమలాయపాలెం: మండలంలోని బీరోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు(1990-91 బ్యాచ్) మంగళవారం బీరోలు పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుని, బాల్య మిత్రులతో కలిసి ఉత్సాహంగా గడిపారు. చాలా రోజుల తర్వాత అందరూ ఒకే వేదికపై కలుసుకోవడంతో పాఠశాల ఆవరణమంతా సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నాటి ఉపాధ్యాయులు కామేశ్వర్రావు, బ్రహ్మం, ప్రభాకర్ రెడ్డిలతో పాటు గ్రామ సర్పంచ్ వంచర్ల అలివేలమ్మ హాజరుకాగా పూర్వ విద్యార్థులు కె.భుజంగరరెడ్డి, బి.అనిల్‌కుమార్, డి.భాస్కర్, పి.రామస్వామి కోటయ్య, బి.సీతారాములు, రాజరత్నం, వై.వనిత బి.పాపమ్మ, లక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా గోదాదేవి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సంక్రాంతి పండుగ చివరి రోజైన కనుమ రోజున మంగళవారం గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ్య కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్మోహన్ రావు పర్యవేక్షణలో సంప్రదాయ పద్ధతుల్లో కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించగా.. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గోశాలను సందర్శించిన ఎన్నారై మిత్ర బృందం


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నారై వాసవీ సంఘం బాధ్యులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లిలో గల శ్రీవేంకటేశ్వర గోశాలకు ఎన్నారై వాసవీ సంఘం మిత్ర బృందం మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కనుమ పండుగ వేడుకలు కనుల నిండుగా జరుగగా.. వాసవీ సంఘం మిత్ర బృందం బాధ్యులు పందిరి శ్రీనివాసరావు, ప్రావాస భారతీయ వాసవీ సంఘం, ఎన్నారై వాసవీ సేవా అసోసియేషన్ బాధ్యులు దేవకి వాసుదేవరావు ఆధ్వర్యాన గోశాల నిర్వాహకులు ఆరుట్ల శ్రీనివాసాచార్యులుకి రూ.లక్ష విరాళంగా అందజేస్తామని ప్రకటించారు. ఈనేపథ్యాన గోశాల కార్మికులకు చీరలు, లుంగీలు, టవళ్లను క్లబ్ ఆధ్వర్యాన అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోళ్ల రాధాకృష్ణ, కోశాధికారి మాశెట్టి వరప్రసాద్, అధికారులు కొదుమూరి జగన్నాథం, రాయల బసవేశ్వరరావు, కొత్తూరు రమేశ్, కొదుమూరు శ్రీనివాసరావు, కొదుమూరు మోహన్ రావు, తేలుకుంట్ల ధనుంజయ్, క్లబ్ సభ్యులు కేసా సత్యం, కేసా గురునాథం, బోనాల సీతారామారావు, యముసాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'గుంటూరు కారం'లో విలన్ల పేర్లు తొలగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మస్తాన్

నేలకొండపల్లి: గుంటూరు కారం సినిమాలో మార్క్స్, లెనిన్ అని విలన్ల పేర్లు పెట్టడం సరికాదని వెంటనే తొలిగించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మస్తాన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రామిక వర్గ నేతలు, మార్కిస్ట్ మహోపాధ్యాయుల పేర్లు పెట్టి సమాజానికి తప్పుడు అవగాహన కల్పిస్తున్నారని ఆరోపించారు. దోపిడీ, పీడన, అణిచివేత లేని సోషలిస్టు సమాజాన్ని ఏర్పరిచినట్లు ఉందని, అలాంటి మహానేతల పేర్లను సినిమాలో తొలగించాలని హెచ్చరించారు. అలాగే సినిమాలో మడత కుర్చీ బూతు పాటను పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, డైరెక్టర్, నటుడు హీరో ఇరువురు కూడా బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సినిమా ప్రదర్శనను అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు..


విజేతలకు బహుమతులు అందిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఖమ్మంరూరల్: యువత క్రీడలపై ఆసక్తి కనబరచాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా మంగళవారం మండలంలోని ఏదులాపురంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు క్రికెట్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఊరడి సుదర్శన్‌రెడ్డి, సోమరాజు, పొన్నెకంటి నర్సింహారావు, ఉమాశంకర్, శ్యాంరెడ్డి, శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగులవంచలో కబడ్డీ పోటీలు..


కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన మండల క్రీడాకారులు

రఘునాథపాలెం: సంక్రాంతి పండుగ సందర్భంగా బోనకల్ మండలం నాగులవంచ గ్రామంలో ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా.. గోర్ సేన ఖమ్మం జట్టు విజేతగా నిలిచి రూ.15 వేలతో పాటు షీల్డ్ సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో ప్రతిభ చాటిన గోర్ సేనను పలువురు నాయకులు అభినందించారు.

సరదాగా సంక్రాంతి సంబరాలు..!

మురిసిన పల్లెలు, పట్టణాలు

- సంతరించుకున్న కొత్త అందాలు
- ముగ్గులు, ఇతర పోటీలతో యువతీయువకుల సందడి
- జోరుగా సాగిన కోడి పందేలు

సంక్రాంతి పండుగ ప్రతి ఇంటా ఆనందాలను పంచింది. కొత్త ధాన్యం ఇంటికి చేరుతున్న వేళ.. అందమైన ముగ్గులు, బొమ్మల కొలువులు, గొబ్బెమ్మలతో మగువలు సందడి చేశారు. పిల్లలు, యువత ఆనందంగా గాలి పతంగులు ఎగురవేయగా.. పలు కుటుంబాల్లో కొత్త అల్లుళ్ల రాకతో సందడి నెలకొంది. ఆదివారం భోగి పండుగ మొదలు భోగి మంటలతో, సోమవారం మకర సంక్రాంతి నాడు పొంగలి, పిండి వంటలతో, పితృ దేవతలు, దేవుళ్ల పూజలతో, మంగళవారం కనుమ నాడు గోపూజలను ప్రజలు సంప్రదాయ పద్ధతుల్లో జరుపుకున్నారు. ఈ నేపథ్యాన జిల్లా సరిహద్దుల్లో కోడి పందేలు జోరుగా సాగగా.. గ్రామాల్లో ముగ్గులు, క్రికెట్, ఇతర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్


కామేపల్లి: పండితాపురంలో ముగ్గులు వేసి రంగులు వేస్తున్న యువతులు


ఖమ్మం మామిళ్లగూడెంలో గంగిరెద్దుల వద్ద మహిళలు, చిన్నారులు


నేలకొండపల్లి: బోదులబండలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం


కామేపల్లి: గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేస్తున్న మహిళ, చిన్నారి


ఖమ్మం శ్రీనివాసనగర్‌లో ముగ్గు వేసి రంగులు అద్దిన దృశ్యం


ఖమ్మం బైపాస్ రోడ్డులో ముగ్గు వేసి రంగులు దిద్దుతున్న చిన్నారులు